క్లుప్తంగా

చిన్నారులకు వైద్య పరీక్షలు



రఘుదేవపురంలో చిన్నారులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్ చైతన్య

సీతానగరం: బంగారు కొండ కార్యక్రమంలో భాగంగా పలు గ్రామాల్లో అంగన్‌వాడీ పిల్లలకు వైద్యసేవలందించారు. సీతానగరం పీహెచ్‌సీలో డాక్టర్ ఎస్ రాజు, డాక్టర్ ఏసు రాణి, రఘుదేవపురంలో డాక్టర్ ఏవీకే చైతన్య, బొబ్బిల్లంకలో డాక్టర్ మేఘన అంగన్‌వాడీ పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 54 మంది పోషకాహార లోపం కలిగిన పిల్లలను గుర్తించారు. వీరికి బంగారు కొండ కార్యక్రమంలో పోషకాహారం అందించేలా చర్యలు తీసుకుంటారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

చంద్రయాన్-3 విజయోత్సవ సంబరాలు



వెదుళ్లపల్లి హైస్కూల్లో చంద్రయాన్-3 సంబరాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు

సీతానగరం: ఇటీవల భారత్ ప్రయోగించిన చంద్రయాన్-3 విజయవంతంకావడంతో వెదుళ్లపల్లి హైస్కూల్లో విజయోత్సవ సంబరాలు జరుపుకొన్నారు. స్కూల్‌లో ఉపాధ్యాయులు నమూన రాకెట్ ప్రయోగాన్ని చేసి చూపించి విద్యార్థులకు వివరంగా తెలిపారు. పైపులు, ఇతర మెటీరియల్‌తో చంద్రయాన్-3, 2, రోహిణి వంటి పెద్ద, చిన్న రాకెట్లను సుమారు 20కి పైగా తయారు చేసి జాతీయ పతాకం, బ్యాండ్ వాయిద్యాల మధ్య గ్రామంలో ఊరేగించారు. హెచ్‌ఎం సీతారత్నం జ్యోతి ప్రజ్వలన చేసి, మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలామ్‌కు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మోహన్, భగవాన్, సుధాకర్, విద్యార్థులు తదతరులు పాల్గొన్నారు.

ఖాతాలో నగదు మాయంపై కేసు

బిక్కవోలు: తన బ్యాంకు ఖాతాలో నగదు మాయమైందని పందలపాక గ్రామానికి చెందిన పైల వెంకటరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ పి.బుజ్జిబాబు తెలిపారు. ఇటీవల కాలంలో అతడి ఖాతా నుంచి రూ.26,700 నగదు మాయమైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థులకు కూలింగ్ వాటర్ టిన్నులు బహూకరిస్తున్న శ్రీనివాసరావు

రంగంపేట: విద్యార్థులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని మంచి ఫలితాల సాధనకు కృషి చేయాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నల్లా శ్రీనివాసరావు సూచించారు. సోమవారం మండలంలోని సింగంపల్లి జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల కోసం పది కూలింగ్ వాటర్ టిన్నులను ఆయన బహూకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ టి.శివశంకరానంద్, హైస్కూల్ కమిటీ చైర్మన్ మేనిడి గోవిందు, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ నాయకులు నల్లా దుర్గాప్రసాద్, ద్వారంపూడి సతీష్‌కుమార్‌రాజా, సీఆర్పీ దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణ స్థలం పరిశీలన

గోకవరం: స్థానిక ఠాణా సెంటర్‌లో ఊరకాలువపై నూతనంగా వంతెన నిర్మాణానికి సేకరించిన స్థలాన్ని మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సోమవారం పరిశీలించారు. టీడీపీ నాయకులతో కలిసి వంతెన నిర్మించే స్థలాన్ని పరిశీలించిన ఆయన వంతెనకు సంబంధించిన పలు విషయాలను ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటిషు కాలంలో నిర్మించిన వంతెన ఇరుకుగా ఉండటం, వంతెనకు ఇరువైపులా భారీ మలుపులు ఉండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడేవారన్నారు. నూతనంగా నిర్మించే వంతెనకు ఇరువైపులా మలుపులు లేకుండా చూడాలని అధికారులకు సూచించామన్నారు. ఆయన వెంట పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు.

జీవన నైపుణ్యాలపై అవగాహన ఉండాలి

రాజమహేంద్రవరం రూరల్: ప్రతి ఒక్కరూ జీవన నైపుణ్యాలపై అవగాహన కలిగి ఉండాలని డైట్ వైస్ ప్రిన్సిపాల్ కె.వి.సూర్యనారాయణ అన్నారు. సోమవారం బొమ్మూరులోని ప్రభుత్వ జిల్లా విద్యాశిక్షణ సంస్థ(డైట్)లో మ్యాజిక్ బస్ సంస్థ, ఎస్‌సీఈఆర్‌టీ సంయుక్తాధ్వర్యంలో జీవన నైపుణ్యాలపై మూడు రోజుల శిక్షణా కార్యక్రమం ప్రారంభమైంది.

అన్నదాతకు అండగా అగ్రి టెస్టింగ్ ల్యాబ్

- నాణ్యత పరీక్షలతో నకిలీ విత్తనాలు, ఎరువులకు చెక్
- నకిలీలని తేలితే సంబంధిత కంపెనీలపై కేసులు



అనపర్తిలో డాక్టర్ వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్

అనపర్తి: గ్రామీణ ప్రాంతాల్లో రైతు భరోసా కేంద్రాల ఏర్పాటు ద్వారా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పుకు నాంది పలికారు. గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలు అన్నదాతలకు బాసటగా నిలుస్తున్నాయి. అదేవిధంగా రైతు ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ ఉత్పాదకాలైన ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల నాణ్యతను ముందుగానే పరీక్షించి నకిలీలకు చెక్ పెట్టేందుకు గాను ప్రభుత్వం వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్ కేంద్రాలను నిర్మించింది. నియోజకవర్గ స్థాయిలో నిర్మించిన ఈ ల్యాబ్‌ల్లో విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల నమూనాలు పరీక్షించి వాటి నాణ్యత ప్రమాణాలను నిర్ధారిస్తారు.

మేలైన విత్తనాలతో అధిక దిగుబడులు

వరి సాగులో విత్తనమే కీలకం. దీనిపైనే పంట దిగుబడి ఆధారపడి ఉంటుంది. విత్తనం మంచిదైతే రైతులు మేలైన దిగుబడులు సాధించే అవకాశముంటుంది. మార్కెట్‌లో వివిధ కంపెనీల విత్తనాలు వివిధ రకాల ప్యాకింగుల్లో అందుబాటులో ఉంటున్నాయి. అయితే వీటిలో ఏది నకిలీ, ఏది మంచిదో తెలియక రైతులు అయోమయానికి లోనవుతున్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల విషయంలో రైతులు మోసపోకుండా ఉండేందుకు, వీటికి పరీక్షలు నిర్వహించి నకిలీలకు చెక్ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లను అందుబాటులోకి తీసుకొచ్చింది.

పరీక్షలు ఇలా

విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల నాణ్యత పరీక్షలను పారదర్శకంగా చేపట్టేందుకు ప్రభుత్వం రీజినల్ కోడింగ్ సెంటర్లను ఏర్పాటుచేసింది. జిల్లా పరిధిలోని టెస్టింగ్ ల్యాబ్‌లకు సంబంధించి తాడేపల్లిగూడెంలో కోడింగ్ సెంటర్ ఉంది. ప్రభుత్వ లక్ష్యాల మేరకు వ్యవసాయ అధికారులు ఎరువులు, విత్తన దుకాణాల్లో సేకరించిన నమూనాలను ప్రత్యేకంగా రూపొందించిన యాప్ ద్వారా బ్యాచ్ నంబర్ కోడింగ్ చేసి రీజినల్ సెంటర్‌కు పంపుతారు. అక్కడ నుంచి ఈ శాంపిల్స్ ఆయా నియోజకవర్గాల్లోని అగ్రి ల్యాబ్‌లకు పంపి పరీక్షలు చేసి నివేదికలు ఇస్తారు. అయితే వీటిల్లో నకిలీలని నిర్ధారిస్తే సంబంధిత దుకాణాలు, కంపెనీలపై చర్యలకు సిఫార్సు చేస్తారు.

రైతులకు పరీక్షలు ఉచితం

వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ల్లో సూక్ష్మ పోషకాలకు సంబంధించిన పరీక్షలే కాకుండా విత్తనం స్వచ్ఛత-నాణ్యత పరీక్షలు, విత్తనాల మొలక, తేమ శాతం, యూరియా, నత్రజని, భాస్వరం, పొటాషియం, సల్ఫేట్, డీఏపీ, ఎరువులు పరీక్షలు చేస్తారు. పంట విత్తు సమయంలో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులపై రైతులకు అనుమానం ఉంటే అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లో వ్యవసాయ అధికారులను సంప్రదిస్తే ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తారు. ప్రైవేటు కంపెనీలకు సంబంధించిన డీలర్లు ఈ పరీక్షల కోసం ప్రభుత్వం నిర్ణయించిన రుసుము చెల్లించాల్సి ఉంటుంది. మూడు న్యూట్రింట్స్(భాస్వరం, పొటాషియం, నత్రజని)కలిపి రూ.2,500, ఒక్కొక్క న్యూట్రింట్‌కు రూ.1,000 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. ప్రభుత్వం అనపర్తిలో 2021లో వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసింది. ఈ మూడేళ్ల కాలంలో ఈ ల్యాబ్‌లో 275 విత్తన పరీక్షలు, 140 ఎరువుల పరీక్షలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.

అనపర్తి ల్యాబ్‌లో చేసిన పరీక్షల వివరాలు

సంవత్సరం	విత్తన పరీక్షలు	ఎరువుల పరీక్షలు
2021-2022	40	17
2022-2023	126	86
2023-2024 (ఇప్పటివరకూ)	109	37

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



నకిలీ విత్తనాలు, ఎరువులను గుర్తించి రైతులకు పూర్తి నాణ్యత ప్రమాణాలతో ఉత్పాదకాలను అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లను ఏర్పాటుచేస్తుంది. రైతులు ఈ ల్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవడంతో పాటు నిపుణుల సలహాలు, సూచనలు పాటిస్తే వ్యవసాయ రంగంలో అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉంటుంది.

– జి.వాణి, ఏఓ, అగ్రి టెస్టింగ్ ల్యాబ్, అనపర్తి

అన్నంతో పరమశివుడికి అభిషేకం

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు బుడతల మామిడి వద్ద ఉన్న శ్రీ బాలా త్రిపుర సుందరీ సమేత త్రిముఖలింగేశ్వర స్వామికి అన్నంతో అభిషేకం చేశారు. ఆదివారం రాత్రి శివుని నక్షత్రమైన ఆరుద్ర, మాస శివరాత్రి కలిసి రావడంతో అర్చకులు రమణ శర్మ, భాస్కర శర్మ, శ్రీనివాస శర్మల ఆధ్వర్యంలో భక్తుల నుంచి సేకరించిన బియ్యాన్ని వండి ఆ అన్నంతో స్వామిని అభిషేకించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామిని దర్శించుకున్నారు.

ఏపీ పీజీ సెట్, ఎడ్‌సెట్‌ల్లో జీబీఆర్ విద్యార్థుల ప్రతిభ

అనపర్తి: ఏపీ పీజీ సెట్, ఎడ్‌సెట్ ఫలితాల్లో స్థానిక జీబీఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభను చాటి ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు ప్రిన్సిపాల్ ఎన్‌పీ అబ్బాయిరెడ్డి తెలిపారు. కళాశాలకు చెందిన ఫిజికల్ సైన్స్ విభాగంలో వి.విజయలక్ష్మి 3వ ర్యాంక్, ఏబీ విజయదుర్గ 32వ ర్యాంక్, పీకే తనుశ్రీరెడ్డి 58వ ర్యాంక్, మేథమెటికల్ సైన్స్ విభాగంలో బి.శ్రీలక్ష్మి 16వ ర్యాంక్, స్టాటిస్టిక్స్ విభాగంలో కె.శ్రీలలిత 57వ ర్యాంక్, కెమికల్ సైన్స్ విభాగంలో కె.అఖిల 95వ ర్యాంక్ సాధించినట్లు చెప్పారు. అదేవిధంగా ఎడ్‌సెట్‌లో బి.శ్రీలక్ష్మి 39వ ర్యాంక్ సాధించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను జీబీఆర్ విద్యాసంస్థల అధినేత తేతలి కొండబాబు, పాలకవర్గ సభ్యుడు జి.రామారెడ్డి తదితరులు అభినందించారు.

నవరత్న పథకాలతో ఇంటింటా సంతోషం

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- అనపర్తిలో గడప గడపకూ మన ప్రభుత్వం



అనపర్తిలో గడప గడపకూ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: పేదల జీవన ప్రమాణాలు మెరుగుపరచడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్న పథకాలతో ఇంటింటా సంతోషం వెల్లివిరుస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక పాతవూరు బాపనమ్మ గుడి ఏరియాలో ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా బాపనమ్మ ఉపాలయం వద్దకు చేరుకున్న ఎమ్మెల్యే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను ప్రజలకు వివరించడంతో పాటు ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో ప్రజా సమస్యలను స్వయంగా తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషిచేయడంలో భాగంగానే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వం తీసుకొచ్చిన జగనన్న సురక్ష కార్యక్రమం అర్హులకు వరంగా మారిందని చెప్పారు. వైఎస్సార్ సీపీ పారదర్శక పాలనపై ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు సత్తి గీతావరలక్ష్మి, సర్పంచ్ వారా కుమారి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కర్రి దొరబాబు, రెడ్డి సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షులు కర్రి అప్పారావు, నల్లమిల్లి నారాయణరెడ్డి, అధ్యక్షుడు తేతలి దుర్గారెడ్డి, వ్యాపారవేత్త కర్రి సూర్యప్రకాష్‌రెడ్డి, వార్డు సభ్యుడు యాసిడ్ రాము, రాష్ట్ర భట్రాజుల కార్పొరేషన్ డైరెక్టర్ షణ్ముఖి చిట్టిరాజు, కోనాల శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు వందనం

మేమున్నాం..



సుంకర మమత నుంచి వివరాలు సేకరిస్తున్న వలంటీర్ రమ్య

కరోనా లాక్‌డౌన్ సమయంలో ఇళ్లకే పరిమితమైన ప్రజలకు వలంటీర్ల సేవలందించారు. దాతలు అందించిన నిత్యావసర సరుకులు, కూరగాయలను ఇంటింటికీ అందజేశారు. తాగునీటితో సహ అందించేవారు. ఎవరికి ఏ అవసరం వచ్చినా క్షణాల్లో తీర్చేవారు. ఆ సమయంలో కూడా సంక్షేమ పథకాలను అందించారు. అప్పుడు ఇంటిలో నుంచి బయటకు రాలేని పరిస్థితిలో వలంటీర్ తాటికొండ రమ్య మమ్మల్ని ఆదుకుందని సుంకర మమత వలంటీర్ సేవలను కొనియాడింది.

– సీతానగరం

సర్టిఫికెట్ ఇవ్వడంతో..



నాకు ఇద్దరు కుమార్తెలు ఒకరికి పుట్టికతోనే వినికిడి శక్తి తక్కువ. చదివించలేని పరిస్థితిలో ఉంటే వలంటీర్ రమ్య వచ్చి వినికిడి లేని కుమార్తెకు దగ్గరుండి సదరన్ సర్టిఫికెట్ చేయించింది. రూ.3 వేలు పింఛను వచ్చేలా చేసింది. ఇప్పుడు పిల్లలను చదివిస్తున్నాను. అమ్మఒడి కూడా అందుకున్నాను. చేయూత పథకం కూడా వచ్చింది. వలంటీర్ ఎంతో సాయం చేసింది.

– సుంకర మమత, కూనవరం

వలంటీర్ సేవలకు సలాం



కాకినాడ జీజీహెచ్‌లో సత్యనారాయణకు నగదు అందిస్తున్న వలంటీర్ జ్యోతి

రంగంపేట: 2020లో కరోనా కారణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లాక్‌డౌన్ విధించాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పింఛనుదారులకు పింఛను సొమ్ముతో పాటు కోవిడ్ కారణంగా మరో రూ.1,000 అదనంగా ఆర్థిక సాయం ప్రకటించారు. వలంటీర్లు కోవిడ్ నిబంధనలు పాటిస్తూ లబ్ధిదారులందరికీ సాయాన్ని అందజేయాలని ఆదేశించారు. ఆ సమయంలో రంగంపేట మండలం జి.దొంతమూరు గ్రామానికి చెందిన మేనీడి సత్యనారాయణ పాముకాటుకు గురై కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. వలంటీర్ దుప్పలపూడి జ్యోతి మానవతా దృక్పథంతో కాకినాడ జీజీహెచ్‌కు వెళ్లి సత్యనారాయణ వద్ద బయోమెట్రిక్ తీసుకుని అతడికి నగదు అందజేసింది. అంతటి విపత్కర పరిస్థితుల్లోనూ వలంటీర్ జ్యోతి కాకినాడ వెళ్లి మరీ పింఛన్ అందజేయడంపై సత్యనారాయణ కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

జగన్‌తో ప్రజా రంజక పాలన

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- చినకొండేపూడిలో గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం



చినకొండేపూడిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ ప్రజా రంజక పాలన సాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. సోమవారం చినకొండేపూడిలో రెండో రోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. సచివాలయ సిబ్బంది, అధికారులు, పార్టీ నాయకులతో కలిసి గ్రామంలో ఎమ్మెల్యే ప్రతి ఇంటికీ వెళ్లి పలకరించి ప్రభుత్వ పథకాలను వివరించారు. అనంతరం గ్రామంలో సమస్యలను వారిని అడిగి తెలుసుకున్నారు. వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ సీఎం జగన్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తున్నారన్నారు. గ్రామంలో నాలుగేళ్లలో రూ.9.53 కోట్లతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఇప్పటికి 611 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల పట్టాలు అందించామన్నారు. ప్రజా శ్రేయస్సు కోసం కృషి చేస్తున్న సీఎం జగన్‌ను రానున్న ఎన్నికల్లో మళ్లీ గెలుపించుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, వైస్ ఎంపీపీ-2 సత్యం మధన్ బాబు, పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు, సర్పంచ్ చెరుకూరి శ్రీనివాస్, ఉపసర్పంచ్ సత్తిపండు రాజు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ పోలినాటి రామచంద్రరావు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలి

- రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



సూర్యదేవాలయంలో అర్చకుల నుంచి ఆశీర్వాదం తీసుకుంటున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

పెదపూడి: ప్రజలంతా సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని రాజానగరం ఎమ్మెల్యే, తూర్పుగోదావరి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. ఆయన సోమవారం పెదపూడి మండలం జి.మామిడాడ గ్రామంలోని జైజై నారాయణ ఆశ్రమంలో స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీసూర్యనారాయణమూర్తి, కోదండరాముని ఆలయాలతో పాటు బిక్కవోలులోని శ్రీలక్ష్మీగణపతి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్థానిక విలేకరులతో ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. ఎమ్మెల్యే రాజా వెంట ఎంపీపీ కేతా తులసి, వైఎస్సార్‌సీపీ గ్రామ కన్వీనర్ ద్వారంపూడి సూర్యనారాయణరెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి మండ రాజారెడ్డి తదితరులున్నారు.

రైతుల కష్టం తీర్చిన సీఎం జగన్

- తొలగిన కోరుకొండ ఈనాం భూముల సమస్య
- వైఎస్సార్ సీపీ సీజీసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి



ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న పార్టీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి

మధురపూడి: సర్వీసు ఈనాం భూములపై సర్వ హక్కులు కల్పించడంతో కోరుకొండకు చెందిన భూముల సమస్యకు పరిష్కారం లభించిందని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నిషేధిత జాబితా నుంచి 1.68 లక్షల ఎకరాల భూములను తొలగించడంతో కోరుకొండ భూములకు విముక్తి లభించిందన్నారు. ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న రైతుల సమస్య తీరిందన్నారు. ఇందుకు గాను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. 2013లో ఈనాం భూములన్నింటినీ 22(ఏ)లో పెట్టారన్నారు. దేవదాయ భూములతో పాటు ఈ భూములను చేర్చారన్నారు. దీంతో భూములున్నప్పటికీ వాటిపై రైతులకు హక్కులేకుండాపోయిందని, దీనివల్ల రైతులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. 2019 ఎన్నికల ప్రచారంలో భాగంగా కోరుకొండ వచ్చిన జగన్‌కు సమస్యను వివరించగా పరిష్కారానికి కృషి చేస్తానన్నారని, అన్న మాట ప్రకారం సర్వీసు ఈనాం భూములపై సర్వ హక్కులు కల్పించారన్నారన్నారు.

దేవస్థానం అభివృద్ధికి కృషి

శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం అభివృద్ధికి కృషి చేస్తున్నట్టు తెలిపారు. దీనిలో భాగంగా కోటి రూపాయల నిధులతో 5 అంతస్తుల రాజగోపురం నిర్మాణం చేసేందుకు ప్రతిపాదనలు పంపినట్టు తెలిపారు. స్వామివారి దేవస్థానం సమీపంలోని రంగనాథస్వామి ఆలయ పునర్నిర్మాణానికి 1.49 కోట్ల నిధులు కేటాయించడానికి ప్రతిపాదనలు పంపినట్టు తెలిపారు. ఇప్పటికే భక్తుల సౌకర్యార్థం గిరి ప్రదక్షణ నిర్మాణం పూర్తయ్యిందన్నారు. చంద్రబాబు ప్రభుత్వంలో స్వామివారి కొండపైనున్న మట్టిని అక్రమంగా రవాణా చేసిన నాయకులు ఇక్కడి అభివృద్ధి కార్యక్రమాల గురించి మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్టుందని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌మీట్‌లో జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అడపా కనకరాజు, కో-కన్వీనర్ గణేశుల పోసి, కోరుకొండ పంచాయతీ ఉపసర్పంచ్ నేతుల చిన్ని, పార్టీ నాయకులు తాడి హరిశ్చంద్ర ప్రసాద్ రెడ్డి, బొరుసు బద్రి, కాలచర్ల శివాజీ, వాకా నరసింహరావు, పసునులేటి బుల్లియ్యనాయుడు, అయిల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలని వినతి

రాజానగరం: డిగ్రీ, పీజీ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని, యూనివర్సిటీలలో ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్టులను భర్తీ చేయాలని, వసతి గృహాల్లో సమస్యలను నివారించి, సదుపాయాలను పెంచాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఆదికవి నన్నయ యూనివర్సిటీలో విద్యార్థులు వీసీ ఆచార్య కె.పద్మరాజుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. పీడీఎస్‌యూ ఇచ్చిన పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమం జరిగిందని పీడీఎస్‌యూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి ఎస్.కిరణ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా కోశాధికారి కె.భానుప్రసాద్, నాయకులు దినేష్, ధర్మేష్, ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో పేదలకు భరోసా



పెద్దాడలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎంపీడీఓ విజయభాస్కర్

పెదపూడి: జగనన్న సురక్ష కార్యక్రమంతో పేద ప్రజలకు భరోసా లభిస్తుందని ఎంపీడీఓ పి.విజయభాస్కర్ అన్నారు. పెద్దాడ గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల వద్దకు పారదర్శకంగా పరిపాలన అందించే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం గ్రామ సభలో 635 మంది లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ డొకుబుర్ర మీనాక్షి, తహసీల్దార్ టి.సుభాష్, ఈఓపీఆర్డీ మన్యం శ్రీనివాసు చౌదరి, ఎంపీటీసీ సభ్యురాలు యాళ్ల మాధవి, సచివాలయ కార్యదర్శి త్రినాథ్, పాలచర్ల రామకృష్ణ చౌదరి పాల్గొన్నారు.

డీఈఈ సెట్ కౌన్సెలింగ్

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని జిల్లా విద్యాశిక్షణా సంస్థ(డైట్)లో సోమవారం డీఈఈ సెట్-2023 మొదటి విడత కౌన్సెలింగ్‌కు 21 మంది హాజరై ఫైనల్ అడ్మిషన్ లెటర్లు పొందారని డైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌డీవీ రమణ తెలిపారు. ఈనెల 20వ తేదీ వరకు డీఈఈసెట్-2023 ధ్రువీకరణ పరిశీలన జరుగుతుందని, అభ్యర్థులు తమకు కేటాయించిన తేదీల్లో బొమ్మూరులోని డైట్‌లో హాజరుకావాలని ఆయన కోరారు.

రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

రాజమహేంద్రవరం రూరల్: రోటరీ క్లబ్ ఆఫ్ రాజమండ్రి ఇన్నొవేషన్ కొత్త టీం (2023-24) ప్రమాణ స్వీకార మహోత్సవం స్థానిక సరస్వతీ ఘాట్ రోడ్డు బొమ్మన రామచంద్రరావు చాంబర్ ఆఫ్ కామర్స్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీ భరత్ ముఖ్య అతిథిగా హాజరై రోటరీ క్లబ్ సమాజానికి అందిస్తున్న సేవలను కొనియాడారు. అనంతరం ఎంపీ భరత్‌ను జ్ఞాపిక, శాలువాతో డాక్టర్ పట్టపగలు వెంకట్రావు, నూతన పాలకవర్గ అధ్యక్షుడు తోట సుబ్బారావు సత్కరించారు.

రోటరీ నూతన పాలకవర్గం

రోటరీ క్లబ్ ఆఫ్ రాజమండ్రి నూతన పాలక వర్గం ప్రమాణ స్వీకారం చేసింది. క్లబ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా డాక్టర్ పట్టపగలు వెంకట్రావు, అధ్యక్షుడిగా తోట సుబ్బారావు, కార్యదర్శిగా నూనె సాయిబాబా ప్రమాణ స్వీకారం చేశారు. రోటేరియన్ ఇమ్మిడియట్ ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఏకేఎస్ భాస్కరరామ్ విఇన్స్‌లేషన్ ఆఫీసర్‌గా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో పరవస్తు సత్యగోపీనాథ దాస్ ప్రభూజీ, ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ రాజమండ్రి (ఐడబ్ల్యూసీ) అధ్యక్షురాలు డాక్టర్ కే ఝాన్సీ, కార్యదర్శి కే రాణి, జీఎస్ఎల్ మెడికల్ కళాశాల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు, యూరాలజిస్ట్ డాక్టర్ టీవీ నారాయణరావు, రాజమండ్రి ఆర్ట్ క్రియేటివ్ కల్చరల్ అసోసియేషన్ (రాకా) అధ్యక్షుడు డాక్టర్ కంటే వీరన్నచౌదరి, రాకా ప్రధాన కార్యదర్శి జీవీ రమణ, స్వామి సూర్య భాస్కరేంద్ర సరస్వతీ తదితరులు పాల్గొన్నారు.